





# పల్లె పండగ వచ్చింది

- మకర రాశిలోకి ప్రవేశించిన సూర్యుడు
- తెలుగింటా మొదలైన సంక్రాంతి సంబరాలు
- ఉట్టిపడనున్న సంస్కృతులు, సంప్రదాయాలు
- అల్లుళ్లు, ఆడపడుచులతో గ్రామాల్లో సందడి

ఆత్మకూరు, జనవరి 13: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే సంక్రాంతి పండుగ వచ్చేసింది. పల్లె ముంగిట సందడి చేస్తోంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడంతో మూడు రోజుల వేడుక మొదలైంది. దీంతో అన్నదాత ఇంట సందడి వాతావరణం నెలకొంది. జానపద కళలు, గంగిరెద్దులు, రంగవల్లులు, కోడిపందేలు, హరిదాసుల కీర్తనలు ఇలా చెప్పుకుంటూ పోతే సంక్రాంతితో గ్రామీణ ప్రాంతమంతా సందడిమయమైంది. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తే సంక్రాంతి పర్వదినంగా చెబుతారు. ఇలా సంవత్సరానికి 12 సంక్రాంతులు వచ్చినప్పటికీ సూర్యుడు పుష్య మాసంలో మకర రాశిలోకి ప్రవేశించిన రోజును సంక్రాంతి అని పిలుస్తారు. రైతన్న పండించిన ధాన్యం ఉత్పత్తులన్నీ ఇదే సమయంలో ఇళ్లకు చేరతాయి. దీనికితోడు ఆడపడుచులు, అల్లుళ్లతో ఈ పండగను సందడిగా జరుపుకుంటారు. ఇళ్ల ముందర ముత్యాల ముగ్గులు వేస్తారు. వాకిళ్లను పచ్చని తోరణాలతో అలంకరించి సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించేలా వేడుక చేస్తారు. మూడు రోజులపాటు జరిగే సంక్రాంతి పర్వదిన వేడుకల్లో ప్రతి రోజూ ఓ ప్రత్యేకతను ఉండడం విశేషం.

### మూడు రోజుల సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొలి రోజు భోగి పండగ చేయడం ఆనవాయితీగా వస్తోంది. చలికాలంలో సంక్రాంతి పర్వదినం రావడంతో చలిని పారదోలాలన్న సంకల్పంతో భోగి మంటలు వేస్తారు. ఇంట్లో ఉన్న పాత వస్తువులను భోగి మంటల్లో వేసి కొత్త జీవితాన్ని ఆరంభించడానికి గుర్తుగా ఆ రోజు భోగి పండుగను సంప్రదాయంగా జరుపుతారు. రాయలసీమ ప్రాంతంలో ఈ పండుగను కీడుగా తలచి చిన్నారులకు దిష్టి తీయడం వంటివి చేస్తారు. అలాగే భోగి పండ్లతో తలంటు స్నానం చేయిస్తారు.



### పితృ దేవతలకు తర్పణాలు

రెండో రోజైన మకర సంక్రాంతి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడంతో వచ్చే శుభదినం. సంక్రాంతి రోజున ఇంట్లో పాలు పొంగించి పిండి వంటలు తయారు చేస్తారు. మకర సంక్రాంతి రోజు పితృ దేవతలకు తర్పణాలు సైతం సంప్రదాయబద్ధంగా ఇస్తారు. ఏడాదిలో 11 సంక్రమణాలకు పితృతర్పణం ఇవ్వకపోయినా.. సంక్రాంతి పర్వదినాన పితృదేవతలను జ్ఞప్తికి తెచ్చికొని వారికి తర్పణాలు ఇస్తారు. అంతేగాకుండా సంక్రాంతి రోజున ఇళ్ల ముందు సుందరంగా అలంకరించి రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెడతారు. గంగిరెద్దులు, హరిదాసుల సందడిలతో సంబరాలు జరుపుకుంటారు. అన్నదాతలు ఇంటికి వచ్చిన ధాన్యపు సిరులకు హరిదాసులకు వితరణ చేసి తమ దాతృత్వాన్ని చాటుకుంటారు.

### పశువుల పండుగగా కనుమ

మూడో రోజైన కనుమను పశువుల పండుగగా జరుపుకుంటారు. తమకు చేతికొచ్చిన పంటలను తామే కాకుండా పశువులు, పక్షులు పాలుపంచుకోవాలన్న ఉద్దేశంతో ఇళ్ల గుమ్మాళ్లపై, ఆలయాల్లో ధాన్యపు కంకులు కడతారు. పల్లెల్లో పశువులే గొప్ప సంపద కావడంతో అవి ఆనందంగా ఉంటేనే అన్నదాత మోములో సంతోష కాంతులు ఉంటాయన్న ఉద్దేశంతో ఈ పండుగను జరుపడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఇదే రోజు బ్రాహ్మణులకు పంట దిగుబడులను సమర్పిస్తున్న ఆనవాయితీ నేటికీ పలు గ్రామాల్లో కొనసాగుతోంది. అలాగే ఈ రోజున ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టడం, గంగిరెద్దుల హడావిడి, హరిదాసుల సందడి, కోడి పందేలు, ఎడ్ల పందేలు సందడి జోరుగా కనిపిస్తుంది.



శ్రీశైలంలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్లో బసవయ్యతో హరిదాసు

### ట్రెండ్ మారిన సంక్రాంతి సంబరాలు

ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే చాలు ఇళ్ల ముంగింట రంగవల్లికలు తీర్చిదిద్దేందుకు మహిళలు పోటీ పడేవారు. ముందస్తుగానే రంగులను సమకూర్చి తెల్లటి ముగ్గులో కలిపి ఆయా రంగులను సిద్ధం చేసుకునేవారు. అలాగే ఇళ్ల ముంగిట ఆవు, గేదె, ఎద్దుల పేడతో కల్లాపి చల్లి సుందరంగా ముగ్గులు వేసేవారు. అయితే ప్రస్తుతం పట్టణాల్లో ఆ ట్రెండే మారిందని చెప్పవచ్చు. ముగ్గు రంగులను తయారు చేసుకునే ఓపిక లేకపోవడంతో నేరుగా ముందే కలిపి విక్రయిస్తున్న రంగు ముగ్గులను కొనుగోలు చేస్తున్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో పశువుల పేడ లభించక పసుపుపచ్చ రంగునీళ్ల చలుకొని ముగ్గులు వేయాల్సిన పరిస్థితి దాపురించింది. వీటికి తోడు పల్లెల్లో మినహాయిస్తే.. పట్టణాల్లో హరిదాసు, గంగిరెద్దుల సందడి కనుమరుగవుతోంది. టీవీల్లో ప్రతక్షమయ్యే సంక్రాంతి సంబరాలను చూసి ఆనందించాల్సి వస్తోంది. కొందరు మాత్రం నేటికీ పాత ఆచారాలను తూచా తప్పకుండా పాటిస్తుండటం గమనార్హం.



### ఉత్తరాయణ పుణ్యకాలం మరక సంక్రాంతితోనే ఆరంభం



ఉత్తరాయణ పుణ్యకాలం మరక సంక్రాంతితోనే ఆరంభం అవుతోంది. ఈపుణ్యకాలం శుభకార్యాలకు అత్యంత శ్రేష్ఠం. అయితే దేశవ్యాప్తంగా ఈ పర్వదినాన్ని పలు రాష్ట్రాల్లో భిన్నంగా నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలను అంబరాన్ని అంటేలా తెలుగు ప్రజలు జరుపుకోవడం పరిపాటిగా వస్తోంది. సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి పండుగా ప్రతీకగా నిలుస్తోంది. సంక్రాంతి ఉత్సవాల్లో నిర్వహించి ప్రతికార్యం శాస్త్రీయమైన పద్ధతులపై ముడిపడి ఉంది. ఇదిలావుంటే మరక సంక్రాంతి రోజున పితృదేవతలకు పిండతర్పణాలు వదలడం ఆనవాయితీగా వస్తోంది. పురాణాల్లో మహారుషులు సైతం మకర సంక్రాంతి కోసం వేచిచూసే వారని శాస్త్రాల ద్వారా తెలుస్తోంది. అందుకే సంక్రాంతికి అంతటి ప్రాశస్త్యం ఉంది.

-గరుడాద్రి సత్యనారాయణ,
పట్టణ పురోహితులు, ఆత్మకూరు

---

# భృంగిపై మల్లన్న



- బ్రహ్మోత్సవాలతో పరవశించిన శ్రీగిరి
- ఉత్సవం ఎదుట చెంచుల కోలాటం

శ్రీశైలం, జనవరి 13: శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పంచాహ్నిక దీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం లోక కల్యాణార్థం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్రపారాయణాలు, చతుర్వేదపారాయణలు చేశారు. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లు భృంగివాహనంపై భక్తులను కనువిందు చేశారు. ముందుగా అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను భృంగి వాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయం ఆలయం వెలుపల నుంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి వాహనసేవ ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, డమరుక నాదాలు, చెంచుల నృత్యాల సందడి భక్తులను ఆకట్టుకున్నాయి.



### నేడు రావణ వాహన సేవ

సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రావణవాహన సేవ నిర్వహిస్తారు.



మహిళల కోలాటం

---

# ముస్లింల ద్రోహి జగన్



షరీఫ్, మల్లెల రాజశేఖర్, సుబ్బారెడ్డిలను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్**

**డోన్, జనవరి 13:** ఎన్నికల ముందు అనేక మోసపూరిత హామీలు ఇచ్చిన సీఎం జగన్ చివరకు ముస్లిం మైనార్టీలకు తీరని ద్రోహం చేశాడని శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు ఇచ్చి ఆర్థికంగా చంద్రబాబు చేయూతనిచ్చారన్నారు. దుల్హన్ పథకంలో వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసి ముస్లింలకు మొండి చేయి చూపిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సీఎం జగన్ ఓటు బ్యాంకుగా వాడుకుని ముస్లింలను వంచించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిములు చంద్రబాబు వెంటే నడుస్తారని, సీఎం జగన్‌కు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్ అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని మండిపడ్డారు. వైసీపీ పాలనలో దోచుకోవడం తప్ప.. ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వహీద్, టీడీపీ నాయకులు ఆలంకొండ నబీ సాహెబ్, అల్లాబకాష్, నజీర్, ఎస్‌టీ హరూన్, జాకీర్, వలి, ఖాజా, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



---

# జిల్లాకు తొలి స్థానం

**పిల్లలను బడిలో చేర్పించడంలో రికార్డు**

నంద్యాల నూనెపల్లె, జనవరి 13 : బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంలో రాష్ట్రంలోనే నంద్యాల జిల్లా మొదటి స్థానం సాధించిందని రాష్ట్ర విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్ తెలిపారు. వందశాతం గ్రాస్ ఎన్రోల్‌మెంట్ రేషియోలో నంద్యాల జిల్లాను ఆదర్శంగా తీసుకోవాలంటూ రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల విద్యాశాఖాధికారులకు పంపిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 5సంవత్సరాల నుంచి 18సంవత్సరాల్లోపు పిల్లలు పాఠశాల, కళాశాలలకు వెళ్లకుండా పారిశ్రామికవాడల్లో, ఇతరత్రా వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్నవారిని గుర్తించాలని అన్నారు. నంద్యాల జిల్లాలో 21రోజుల లోపల 5,257మంది విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించినట్లు పేర్కొన్నారు.

### రేపటి పోలీసు స్పందన రద్దు

నంద్యాల క్రైం, జనవరి 13 : పోలీసు స్పందన కార్యక్రమాన్ని సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ నెల 15న రద్దు చేసినట్లు ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి నంద్యాల జిల్లా కేంద్రానికి రావద్దని ఆయన సూచించారు. ఆ తర్వాత వచ్చే సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం యథావిధిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

## నేటి నుంచి తాండవ మల్లేశ్వరుని కల్యాణం



**కొత్తపల్లి, జనవరి 13:** కొత్తపల్లిలో వెలసిన తాండవ మల్లేశ్వరుని కల్యాణ మహోత్సవానికి దేవదాయ శాఖ, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని 14 నుంచి 17వ తేదీ వరకు పార్వతి సమేత తాండవ మల్లేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ ఈవో కార్తీక్ మాట్లాడుతూ ఈ నెల 14న స్వామివారికి బిందే సేవ, గణపతి పూజ, అంకురార్పణ, 15న స్వామి వారి కళ్యాణ మహోత్సవం, 16న ప్రభోత్సవం, రాత్రి చెక్క భజన, 17న ఉత్సవమూర్తులను పల్లకి సేవలో ఊరేగించడం, సాయంత్రం పారువేటతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

## ముస్తాబైన దేవాలయాలు

**పగిడ్యాల, జనవరి 13:** మండలంలోని తూర్పు ప్రాతకోట గ్రామంలోని నాగేశ్వరస్వామి, పడమర ప్రాతకోట గ్రామంలోని కాశీశ్వర, నందీశ్వరస్వామి దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. తిరుణాల వేడుకలను పురస్కరించుకొని ఆయా గ్రామాల్లోని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయాలను అలంకరణ చేస్తున్నారు. 14న స్వామి వారి కల్యాణం, 15న రథోత్సవం, 16న పారువేట ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## రేపు బండలాగుడు పోటీలు

**పగిడ్యాల, జనవరి 13:** మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో 15న అంతరాష్ట్ర స్థాయి న్యూ క్యాటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే ఎద్దుల యజమానులు రూ. 600 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ. 35వేలు, మూడో బహుమతి రూ. 20వేలు, నాలుగో బహుమతి రూ. 10వేలు, ఐదో బహుమతి రూ. 8వేలు అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9949140245, 9441408722లను సంప్రదించాలన్నారు. అలాగే 14న ట్రాక్టర్ రివర్స్ పందెం, పొట్టేళ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ముచ్చుమర్రి ఎస్‌ఐగా జయశేఖర్

**పగిడ్యాల, జనవరి 13:** ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా జయశేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విదులు నిర్వహిస్తున్న ఎస్ఐ నాగార్జున బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్‌కు బదిలి అయ్యారు. దింతో ఆదోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న జయశేఖర్ బదిలీపై ముచ్చుమర్రి స్టేషన్‌కు వచ్చారు.

## సారా స్థావరాలపై దాడులు

**నంద్యాల క్రైం, జనవరి 13 :** జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సెబ్ అధికారులు నాటుసారా స్థావరాలపై , తెలంగాణ నుంచి అక్రమంగా తీసుకెళ్తున్న మద్యంపై దాడులు నిర్వహించినట్లు నంద్యాల అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడు తెలిపారు. ఈ దాడుల్లో 23కేసులు నమోదు చేసి 24మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 193లీటర్ల సారాతోపాటు 7 తెలంగాణ మద్యం బాటిళ్లు, 186 కర్ణాటక టెట్రా ప్యాకెట్ సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 2 కార్లు, ఒక సెల్‌ఫోన్, రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 14డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. 12ఓపెన్ డ్రింకింగ్ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 115 బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

**ఆత్మకూరు రూరల్:** ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామ శివారులో నాటు సారా స్థావరాలపై శనివారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. గ్రామంలో సీఐ నాగభూషణ్ ,సెబ్ సీఐ నాయుడుల ఆధ్వర్యంలో పోలీసులు, సెబ్ సిబ్బందితో కార్డన్ సర్చ్ నిర్వహించారు. గ్రామ శివార్లలోని అటవీ ప్రాంతంలో రెండు నాటుసారా స్థావరాలను గుర్తించి ఆ బట్టీల వద్ద 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, అక్కడ ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న 900 లీటర్ల బెల్లపు ఊటను, నాటు సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. దాడులలో ఆత్మకూరు ఎస్‌ఐలు నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, కొత్తపల్లి ఎస్ఐ హుసేన్ బాషా, వెలుగోడు ఎస్ఐ వెంకటప్రసాద్, సెబ్, సిబ్బంది పాల్గొన్నారు. .

## మెల్విన్ జోన్స్ సేవలు చిరస్మరణీయం



మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**నంద్యాల (నూనెపల్లె), జనవరి 13:** అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ సేవలు చిరస్మరణీయమని ఐఎంఏ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధి, దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అన్నారు. మెల్విన్ జోన్స్ జయంతి సందర్భంగా నంద్యాల శాఖ లయన్స్ క్లబ్, నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జోన్స్ చిత్రపటానికి సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోళ్ళ రాజేంద్ర ప్రసాద్ సౌజన్యంతో రూ.20 వేల విలువ చేసే చంకకర్రలు 20 మంది దివ్యాంగులకు, ఐదు మంది నిరుపేద దివ్యాంగులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నంద్యాల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి నాగరాజు, జోన్ ఛైర్మన్ చంద్రమోహన్, జిల్లా ఛైర్మన్ రమణయ్య, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రూ.5.11 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధి

**నంద్యాల క్రైం, జనవరి 13:** నంద్యాల జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.5కోట్ల 11లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి తెలిపారు. రూ.1.6కోట్లతో నూతనంగా నిర్మించిన బాలల సత్వర చికిత్స కేంద్రం, మెడికల్ కాలేజీలో రూ.1.50కోట్లతో లెక్చరర్ హాల్‌తోపాటు నూతన ఓపీ రిజిస్ట్రేషన్ సెంటర్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైద్యరంగంలో భాగంగా నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ వైద్యశాలలో రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు దాదాపు రూ.5.11కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. త్వరలో నంద్యాలలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయడానికి సీఎం చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర ముస్లిం మైనార్టీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పీపీనాగిరెడ్డి, దృశ్యకళల డైరెక్టర్ సునీతఅమృతరాజ్, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా.శశికళారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్‌ఛైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ వరప్రసాద్, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, మహబూబ్ బాష, కౌన్సిలర్లు సమ్మద్, తబ్రేజ్ పాల్గొన్నారు.

## యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి

**ఆత్మకూరు, జనవరి 13:** యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు శనివారం బావనంతాపురం సమీపంలోని ఈడెన్ గార్డెన్ మైదానంలో జరుగుతున్న కార్తీక్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఆయన సందర్శించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈయన వెంట ఆ పార్టీ నాయకులు సయ్యద్‌మీర్, విజయ్‌చౌదరి, సల్మాన్‌బాషా, సురేష్, నాగరాజు, యూనూస్‌బాషా ఉన్నారు.

## జగన్‌ను నమ్ముకుంటే

# మట్టి తినాల్సిందే..

● సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు: అంగన్‌వాడీలు ● 33వ రోజుకు చేరిన సమ్మె





జూపాడుబంగ్లా, నంద్యాలలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఆత్మకూరులో మట్టి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



పాములపాడులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పగిడ్యాలలో మెడకు ఉరి వేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పాణ్యంలో సంతకాలు చేసిన ప్రతులు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

**జగన్‌ను నమ్ముకుంటే మట్టి తినాల్సిందేనని అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం చేశారు. శనివారం వారు వివిధ రూపాల్లో వినూత్నంగా నిరసనలు తెలిపారు. వేతనాలు పెంచాలని చేస్తున్న సమ్మె 33వ రోజుకు చేరింది.**

**నంద్యాల (నూనెపల్లె), జనవరి 13:** ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని అంగన్‌వాడీలు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వంతో యూనియన్ సంఘాల నాయకుల చర్చలు శుక్రవారం కూడా విఫలం కావడంతో నిరవధిక సమ్మెను అంగన్‌వాడీలు కొనసాగిస్తున్నారు. శనివారం నంద్యాలలోని నిరవధిక సమ్మె దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం తమతో పాటు మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా ఉద్యోగులకు న్యాయం చేసి అంగన్‌వాడీలను విస్మరించడం ప్రభుత్వానికి సమంజసం కాదని అన్నారు. అంగన్‌వాడీల ఉద్యమం వెనుక రాజకీయ పార్టీల కుట్ర ఉన్నాయని ఆపాదించడం దుర్మార్గమని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చేతకాని మాటలు మాట్లాడటం ప్రభుత్వానికి మంచి పద్ధతికాదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు.

**పగిడ్యాల:** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారించాలని పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు మెడకు ఉరితాడు వేసుకొని శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు కుర్షిద్‌బీ, అంగన్‌వాడీలు నాగమణి, పద్మావతి, నారాయణమ్మ, ప్రభావతి ఉన్నారు.

**జూపాడుబంగ్లా:** కనీసవేతనాలు ప్రభుత్వం పెంచే వరకు పోరాటం ఆగదని అంగన్వాడీ యూనియన్ నాయకులు హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద తమపిల్లలతో కలిసి ఆందోళన చేపట్టారు. 33రోజుల నుంచి సమ్మెచేస్తున్న అంగన్‌వాడీలకు కౌలురైతు సంఘం జిల్లా నాయకులు స్వామన్న, వ్యకా.స. జిల్లా నాయకులు కర్ణ మద్దతు పలికారు.

**పాణ్యం :** పాణ్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలో శనివారం కోటిసంతకాల సేకరణ చేపట్టారు. శనివారానికి 33 వరోజుకు చేరుకుందని సీఐటీయూ నాయకురాళ్లు వెంకటమ్మ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి భాస్కర్, ప్రతాప్, మరియమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

**పాములపాడు:** ప్రభుత్వం అంగన్‌వాడీ పట్ల నిర్లక్ష్యం వస్తుందని, సంక్రాంతి పండుగరోజైన మొండి వైఖరి విడనాడి డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన పాములపాడులోని దీక్షా శిబిరంలో సంక్రాంతి రంగవల్లి ముగ్గులను వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో శివలక్ష్మి, మద్దమ్మ, నాగమణి, రవణమ్మ, హెల్పర్స్ పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక నిరాహారదీక్షలు శనివారానికి 33వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని నిరసన దీక్షా శిబిరం వద్ద వారు మట్టి తింటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, రణధీర్, నాయకులు పాల్గొన్నారు.

## చీరెల పంపిణీ



చీరెలను పంపిణీ చేస్తున్న అభిరుచి మధు

**నంద్యాల (కల్చరల్), జనవరి 13:** సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్నట్లు నంద్యాల బీజేపీ కన్వీనర్ అభిరుచి మధు పేర్కొన్నారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న బీజేపీ కార్యాలయంలో మూడువేల మందికి చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షబానా,శిల్పా,జ్యోతి,చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు షేబ మహిమోత్సవ వేడుకలు

**నంద్యాల (నూనెపల్లె), జనవరి 13:** నంద్యాలలోని దేవనగర్‌లో ఉన్న షేబ ప్రార్థనా మందిరంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం 7 గంటలకు మహిమోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మినిస్ట్రిస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పుటికెల బెన్‌హిన్ శనివారం తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంత క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ముగిసిన తితిదే హిందు ధర్మ ప్రచార పరిషత్ కార్యక్రమాలు



గోపూజలు నిర్వహిస్తున్న భక్తులు

**వెలుగోడు, జనవరి 13 :** మండలంలోని వేల్పనూరు గ్రామంలో తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. గ్రామంలోని అంకాల పరమేశ్వరీ దేవస్థానంలో తితిదే వారు గత మంగళవారం నుంచి శనివారం వరకు ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ముగింపు సందర్భంగా గోపూజ, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, హిందు ధర్మ ప్రచార మండలి సభ్యులు రామలింగేశ్వరరెడ్డి, అర్చకులు సురేంద్రశర్మ, నానిశర్మ, సభ్యులు నారాయణరెడ్డి, రఘునాధరెడ్డి, భాస్కరరెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, బన్నూరు చంద్రశేఖర్, భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**పాణ్యం, జనవరి 13 :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఉమ్మడి జిలాల్ల స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం కబడ్డీ క్రీడకు ఎన్నో సేవలందించి మృతి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారుల చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడలకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటు అందిస్తుందన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఏఎస్పీ వెంకటరాముడు, ఎంపీపీ ఉశేన్‌బీ, సర్పంచ్ పల్లవి, ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, కోఆప్షన్ సభ్యులు జాకీర్, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి, బాబు, ఎంఈఓ2 సుబ్రహ్మణ్యం, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వెండి హారతి పళ్లెం బహూకరణ



వెండి హారతి పళ్లెం అందిస్తున్న భక్తులు

**రుద్రవరం, జనవరి 13:** మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి దేవాలయానికి శనివారం గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఇందూరి సునీల్‌కుమార్‌రెడ్డి - సునీత దంపతులు 850 గ్రాముల వెండి హారతి పళ్లెందను బహూకరించారు. ఆలయ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, వైస్ ఛైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి నరసింహులుకు అందించారు.

## ఆలయానికి రూ.2.60 లక్షల ఆదాయం

**బేతంచెర్ల, జనవరి 13:** మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్ర ఆదాయం రూ2.60 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి, ఛైర్మన్ సీతారామచంద్రరావు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## రేపు విష్ణు భాగ్య రథోత్సవం

● శోభా యాత్ర



విష్ణుభాగ్య రథోత్సం కరపత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

**నంద్యాల (కల్చరల్), జనవరి 13:** నంద్యాల సంజీవ నగర్ కోదండ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో 70 భక్తగ్రేసరుల సహకారంతో రూ.40 లక్షల వ్యయంతో శ్రీవిష్ణుభాగ్య రథాన్ని తయారు చేశారు. అనేక మంది దేవతామూర్తులతో శైబ్య, వలాహకమనే అశ్వాలతో బ్రహ్మరథ సారధిగా సాగే 18 అడుగుల దివ్య రథం స్వామి వారి సేవ కోసం 5 అంచుల వ్యవస్థతో 102 బొమ్మలతో తయారైందని భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య తెలిపారు. లోక కళ్యాణం కోసం తయారు చేసిన ఈ విష్ణుభాగ్య రథోత్సవంలో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి శోభా యాత్రలో భక్తులంతా పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ శోభాయాత్ర గోవింద నామం, భజనలతో, డప్పులు, నృత్యగాన విలాసములతో పట్టణంలోని సంజీవనగర్, శ్రీనివాసనగర్, ప్రతాప్ థియేటర్, వివేకానంద సెంటర్, గాంధీచౌక్, శ్రీనివాసనగర్‌కు చేరుకుంటుందని తెలిపారు.

## 'శూన్యపు మనసులో చిగుర్లు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

**నంద్యాల (కల్చరల్), జనవరి 13:** కవి కొప్పుల ప్రసాద్ రచించిన శూన్యపు మనసులో చిగుర్లు పుస్తకాన్ని శనివారం రామక్రిష్ణ డిగ్రీ కళాశాల మినీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలసాహితీ వేత్త డా.హరికిషన్, కళారాధన ప్రధాన కార్యదర్శి డా.రవిక్రిష్ణ, సూసాసం అధ్యక్షులు డా. గెలివి సహదేవుడు, రోటరీ క్లబ్ ప్రతినిధులు డీవీ సుబ్బయ్య, అన్నెం శ్రీనివాసరెడ్డి తదితరులు అతిథులుగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. అతిథులు మాట్లాడుతూ సమాజాన్ని జాగృతం చేయాలన్న తపనతో రచయత కొప్పుల ప్రసాద్ నిరంతరం అక్షర ప్రవాహాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కళ, సాహిత్య రంగాలలో నంద్యాలకు ప్రత్యేక స్థానం ఉందని వర్థమాన కవి ప్రసాద్ కవితా రచనలు సామాజిక ప్రయోజనంతో కొనసాగడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కవులు వెంకటరమణమూర్తి, మణిశేఖర్‌రెడ్డి, హుస్సేన్‌రెడ్డి, నీలకంఠమాచారి, మాబుబాషా, గద్వాల రామక్రిష్ణ, కన్నయ్య పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం



మంటలను అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**పాములపాడు, జనవరి 13 :** పాములపాడులో గడ్డివాము కాలిపోయి పూర్తిగా దగ్ధమైంది. శనివారం ఉర్దూ పాఠశాల సమీపంలో వెంకటేశ్వర్లు అనే రైతు కళ్ళంలో రెండు ఎకరాల గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం కాలిపోయింది. దాదాపు 30వేలు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.

## ఎర్రజెండా కార్మికులకు అండ : సీఐటీయూ



జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

**జూపాడుబంగ్లా, జనవరి 13:** కార్మిక, కర్షక, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు ఎర్రజెండా అండగా ఉంటుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వ్యకాస జిల్లా నాయకులు నాగేశ్వరరావు అన్నారు. శనివారం జూపాడుబంగ్లాలో కార్మిక కర్షక భవనాన్ని ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాము, కర్ణ, నరసింహులు, ఏసన్న, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పూజలు





కోలాటం వేస్తున్న భక్తులు

# శ్రీశైలానికి సంక్రాంతి శోభ





**శ్రీశైలం, జనవరి 13:** శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పంచాహ్నిక దీక్షతో ఏడురోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం లోక కల్యాణార్థం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించారు.

● శ్రీశైలం దేవస్థానం దర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీనల్లమోలు బృందంచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేశ పంచరత్నం, శంభో..భో శంభో.., శావాష్టకం, కాలభైరవాష్టకం తదితర గీతాలకు కుందన, భవజ్ఞ, జశ్విత, తపస్య, యజ్ఞ, ఆద్య, గురు తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

# ఎన్నికలకు సన్నాహం..!



కర్నూలు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారుల నేతృత్వంలో యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఓ వైపున సిబ్బందికి శిక్షణ ఇస్తూనే.. మరో వైపున ఈవీఎం యంత్రాలు, పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేస్తున్నారు. అదే క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు సుమారుగా 30 వేల మంది సిబ్బంది అవసరమని అంచనా. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, ఓటర్ల జాబితా తయారీ తదితర అంశాలపై ఇటీవల విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కమిషనర్ వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులను పక్కన పెట్టి వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలు నిర్వహించాలని సీఎం జగన్ ప్రభుత్వం అనుకుంటే.. దానిని సీఈసీ ఆరంభంలోనే అడ్డుకుంది. ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులను నియమించాలని సీఈసీ తీసుకున్న కీలక నిర్ణయంతో ఉపాధ్యాయులు సహా వివిధ శాఖల ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు.


- ఉమ్మడి జిల్లాలో 3,807 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల నిర్వహణకు 30 వేలకు పైగా ఉద్యోగులు
- వివిధ శాఖల నుంచి వివరాల సేకరణ
- సీఈసీ ఆదేశాలతో ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు

### వైసీపీకి మింగుడు పడని సీఈసీ నిర్ణయం

రాబోయే ఎన్నికల్లో ఉపాధ్యాయులను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తీసుకున్న నిర్ణయం సీఎం జగన్, వైసీపీ నాయకులకు మింగుడు పడడం లేదు. గత ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తా అని వైఎస్ జగన్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ మాట చెప్పి ఐదేళ్లు కావస్తున్నా సీపీఎస్ ఊసే లేదు. పైగా సీపీఎస్ రద్దు సహా వివిధ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు జేఏసీ ఆధ్వార్యంలో వివిధ రూపాల్లో ఆందోళన చేశారు. జగన్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. చలో విజయవాడకు పిలుపు ఇస్తే.. ఎక్కడికక్కడే ఉపాధ్యాయులను అరెస్టులు చేసింది. అక్రమ కేసులు కూడా పెట్టింది. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వం మీద అసమ్మతితో ఉన్నారు. అంతేకాక .. కరోనా సమయంలో గురువులను 'మద్యం దుకాణాలు' వద్ద పని చేయించారు. సర్కారు కక్షగట్టి వివిధ రూపాల్లో ఒత్తిళ్లకు గురి చేస్తున్నదని ఉపాధ్యాయులు ఆగ్రహంతో ఉన్నారు. అందుకని ఎన్నికల విధులకు వారిని దూరం పెట్టి ఏ మాత్రం అనుభవం లేని సచివాలయ ఉద్యోగులతో ఎన్నికలు నిర్వహించి లబ్ధి పొందాలని సీఎం జగన్ ప్రభుత్వం ఎత్తులు వేసింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం జగన్ సహా వైసీపీ నాయకులకు ఏ మాత్రం మింగుడు పడడం లేదు.

### ఉద్యోగుల వివరాలు పంపండి

కర్నూలు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో 2,186 పోలింగ్ కేంద్రాలు (పీఎస్) ఉన్నాయి. నంద్యాల జిల్లా నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, శ్రీశైలం, బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల పరిధిలో 1,621 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 3,807 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓతోపాటు మరో నలుగురు సిబ్బంది కలిసి ఎన్నికల విధులు నిర్వహించాలి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 22,842 మంది, 10 శాతం రిజర్వుడు సిబ్బంది 2,285 మంది కలిపి 25,127 మంది ఉద్యోగులు అవసరమని అంచనా. వీరితో పాటు రూట్ ఆఫీసర్లు, జోనల్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు (సూక్ష్మ పరిశీలకులు), ఓట్ల లెక్కింపు సిబ్బంది, ఎన్నికల సెల్ సిబ్బంది ఇలా వివిధ విభాగాల్లో పని చేసేందుకు మరో 5 వేల మందికి పైగా అసరమని అంచనా. ఈ లెక్కన సుమారుగా 30 వేల మందికిపైగా ఉద్యోగులు కావాలి. ఈ అవసరాల దృష్ట్యా ఉద్యోగుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉందని ఓ అధికారి పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖల్లో పని చేసే ఉద్యోగుల వివరాలు పంపాలంటూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు ఆయా శాఖ హెచ్ఓడీలకు ఆదేశాలు జారీ చేశారు.




**34 వివరాలు సేకరణ**

ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులకు చెందిన 34 వివరాలు సేకరించారు. ఉద్యోగి పేరు, హోదా, జీతం, సొంత జిల్లా, ఉద్యోగం చేస్తున్న జిల్లాలో ఎన్నేళ్లుగా విధులు నిర్వరిస్తున్నారు, ప్రస్తుతం పని చేసే నియోజకవర్గంలో ఎన్నేళ్లుగా ఉన్నారు, గత ఎన్నికల్లో విధులు నిర్వర్తించారా..? ఇలా 34 వివరాలు సేకరించారు. ఇప్పటికే ఆయా శాఖల హెచ్ఓడీలు ఎన్నికల సంఘం అడిగిన ఫార్మెట్‌లో వివరాలను కలెక్టర్లకు అందజేశారు. తాజాగా ఉపాధ్యాయులను కూడా ఎన్నికల విధులకు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓ) ఉపాధ్యాయుల వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. ఒకటి రెండు రోజుల్లో కేంద్ర ఎన్నికల సంఘం అడిగిన ఫార్మెట్‌లో ఉపాధ్యాయుల వివరాలు డీఈఓలు కలెక్టర్లకు సమర్పించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



## నేడు బాల సాయిబాబా జయంతి వేడుకలు



కర్నూలు(కల్చరల్), జనవరి 13: భగవాన్ బాలసాయిబాబా జయంతి వేడుకలు ఆదివారం పాత నగరంలోని శ్రీనిలయంలో నిర్వహిస్తున్నట్లు బాల సాయి బాబా సెంట్రల్ ట్రస్టు ట్రస్టీ టి. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనిలయంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి బాల సాయిబాబా విగ్రహానికి అభిషేకం, శ్రీచక్రార్చన, భజనలు ఉంటాయని తెలిపారు. దీనజన సేవా కార్యక్రమాల్లో భాగంగా వివిధ ఆసుపత్రుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని అన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు శృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్‌చే ఆధ్యాత్మిక ప్రవచన బోధనలు ఉంటాయని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కోసిగి, జనవరి 13: మండల పరిధిలోని ముగలదొడ్డి గ్రామానికి చెందిన కురువ ముత్తన్న (30) అనుమానాస్పద మృతి చెందాడు. ముత్తన్నకు పదేళ్ల క్రితం లక్ష్మీతో వివాహమైంది. వీరికి పిల్లలు కలగలేదు. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో పది రోజుల క్రితం లక్ష్మి కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణలో భాగంగా ఇద్దరు కానిస్టేబుళ్లు శుక్రవారం మూగలదొడ్డి గ్రామానికి వెళ్లి బైక్‌పై ముత్తన్నను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. భార్యాభర్తలను విచారించి రాత్రి 9 గంటలకు ఇంటికి పంపారు. శనివారం ఉదయం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మోకాళ్ల ఎత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. మృతుని పాదాలకు గాయాలు, వీపు వెనుక కొట్టిన దెబ్బలు ఉండటంతో ముత్తన్న అక్కలు భీమమ్మ, శివలింగమ్మ, జలాలి.. విచారణ పేరుతో కొట్టారని, ఆ బాధతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించకుండా పోలీసులతో వారు గొడవకు దిగారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చి మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా ముత్తన్న మీద అతని భార్య ఫిర్యాదు చేయడంతో విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చామని, అతడ్ని కొట్టలేదని తెలిపారు.

## 30 సీజనల్ హాస్టళ్లకు అనుమతి

కర్నూలు (కలెక్టరేట్), జనవరి 13 : జిల్లాలో 2023 -24 సంవత్సరానికి 30 సీజనల్ హాస్టళ్లకు అధికారులు అనుమతి ఇచ్చారు. జిల్లాలో కరువు నెలకొన్న నేపథ్యంలో బతువుదెరువు కోసం హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, చెన్నై తదితర ప్రాంతాలకు తల్లిదండ్రులతోపాటు పాఠశాలలో చదివే విద్యార్థులు వలస వెళ్తున్నారు. దీంతో ప్రభుత్వం సీజనల్ హాస్టళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇందులోభాగంగా కోసిగి మండలంలో 8, తుగ్గలి, క్రిష్ణగిరి మండలాల్లో 5, పత్తికొండ మండలంలో 4, కౌతాళం మండలంలో 3, హొళగుంద మండలంలో 2, నందవరం కోడుమూరు హాలహర్వి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మంజూరయ్యాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామంలోని పొదుపు సంఘాలు, ఎన్జీవోలకు సీజనల్ హాస్టళ్లు కేటాయించనున్నారు. ఒక సీజనల్ హాస్టల్‌కు 50 మంది విద్యార్థులకు కేటాయిస్తారు. విద్యార్థులకు టిఫిన్, రాత్రి భోజనం, స్నాక్స్ ఇవ్వనున్నారు. నెలకు ప్రతి విద్యార్థికి రూ.1000, కాస్మోటిక్ ఖర్చులకు రూ.66, కేర్ టేకర్‌కు రూ.10,000 వలంటరీకి రూ.10,000, కుక్‌కు రూ.5,000, హెల్పర్‌కు రూ.5,000 ఇవ్వనున్నారు.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్ దుర్మరణం
- 13 మందికి స్వల్ప గాయాలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కర్నూలు, జనవరి 13: డోన్ జాతీయ రహదారిలో ఉలిందకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని కొంగన పాడు ఫ్లైఓవర్ సమీపంలో ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిం ది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ ఆంజనేయులు దుర్మరణం చెందా డు. బస్సులో ఉన్న 13 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే వీరిని ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం వెళ్తోంది. శుక్రవారం రాత్రి కళ్యాణదుర్గం డిపో నుంచి బయలు దేరింది. అర్ధరాత్రి సమయంలో ఉలిందకొండ సమీపానికి వచ్చింది. అదే సమ యంలో జాతీయ రహదారిపై టైరు పంక్చరై ఓ లారీ నిలబడిపోయింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ వేగంగా వచ్చి ఆగివున్న లారీని ఢీకొట్టింది. దీంతో బస్సు నుజ్జునుజ్జయింది. డ్రైవర్ సీటులో ఉన్న ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఆ లారీ యాడికి మండలం రాయలచెరువు నుంచి హైదరాబాదుకు పెయింటింగ్ పౌడర్‌ను తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఎస్ఐ నల్లప్ప సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో ఉన్న మరో డ్రైవర్ శివన్న ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆంజనేయులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

# టీడీపీతోనే బీసీల సాధికారత

- 30కి పైగా పథకాలను రద్దు చేసిన వైసీపీ
- జయహో బీసీలో గౌరు చరిత



బుక్‌లెట్‌ను విడుతల చేస్తున్న గౌరు దంపతులు, మల్లెల రాజశేఖర్

కల్లూరు, జనవరి 13: తెలుగుదేశం పార్టీతోనే బీసీ కులాల సాధికారత, బీసీలకు రాజ్యాధికారం సాకరమైందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత స్పష్టం చేశారు. శనివారం ఉలిందకొండలో మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, ఈవీ రమణ ఆధ్వర్యంలో చేపట్టిన జయహో బీసీ కార్యక్రమానికి నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి గౌరు చరిత పాల్గొన్నారు. ముందుగా మహాత్మా జ్యోతిరావుపూలే, డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టి సంత మార్కెట్ వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రక్షణ లేదని, 74 మంది బీసీ నేతలను పొట్టన పెట్టుకుందని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 34శాతం నుంచి 24శాతానికి తగ్గించారని, బీసీలను రాజ్యాంగ పదవులకు దూరం చేసిన జగన్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక దాదాపు రూ.75,760 కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారని తెలిపారు. ఆదరణలాంటి 30కి పైగా బీసీ సంక్షేమ పథకాలు రద్దు చేసిన దుర్మార్గపు ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. వక్ఫ్, ప్రైవేట్ భూములను కబ్జా చేసిన నాయకులకు ఓటుతో సమాధానం చెప్పాలని సూచించారు. బీసీలకు కార్పొరేషన్లు, సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుదన్నారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ బీసీలకు వెన్నుదన్నుగా ఉన్న ప్రభుత్వం టీడీపీ మాత్రమే అన్నారు. బీసీల ద్రోహి జగన్‌రెడ్డిని గద్దెదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సంఘాల నాయకులు మల్లికార్జున, బి.రామకృష్ణ, జిల్లెల శ్రీరాములు, సి.రాంబాబు, బెస్త వెంకటేష్, అరుణ, తిరుపాల్‌బాబు, నాగేశ్వరరావు యాదవ్, శివరాజు, పాణ్యం ఐటీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, కె.మహేష్‌గౌడ్, జె.గంగాధర్‌గౌడ్, ఎన్వీ రామకృష్ణ, మాదన్న, మాదేష్, ధనుంజయ,రంగస్వామిరెడ్డి, హీరునాయక్, సహరాబి, టీడీపీ బీసీ సంఘాల నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## న్యాయం గెలిచింది: కేఈ శ్యాబాబు



పత్తికొండ, జనవరి 13 :తనపై పెట్టిన నిరాధార కేసులో న్యాయం గెలిచిందని, తనపై పెట్టిన కేసును కోర్టు కొట్టివేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు తెలిపారు. శనివారం ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 2017లో వైసీపీ నాయకుడు నారాయణరెడ్డి హత్యతో తనకు ప్రమేయం లేకపోయినా కేసులో ఆయన కుటుంబసభ్యులు తన పేరును చేర్చారన్నారు. జిల్లా కోర్టు విచారించి తనకు ఎలాంటి సంబంధం లేదని శనివారం కొట్టి వేసిందన్నారు.

## పాలం ఆన్‌లైన్‌కు లంచం డిమాండ్

- రూ.3000 ఇస్తూ వీడియో తీయించిన రైతు
- సోషల్ మీడియాలో వైరల్



మధ్యవర్తి దగ్గరి నుండి డబ్బులు తీసుకుంటున్న ఆర్ఐ దినేజ్ కుమార్

ఆదోని, జనవరి 13 : ఆన్‌లైన్‌లో పొలం నమోదు చేసేందుకు ఓ రెవెన్యూ అధికారి లంచం డిమాండ్ చేశాడు. దీంతో సదరు రైతు లంచం ఇస్తూ రహస్యంగా తీసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. గజ్జెహళ్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఆర్ఐ దినేజ్ కుమార్ కోరాడు. నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరిగినా సదరు అధికారి పట్టించుకోలేదు. అదే గ్రామానికి చెందిన మధ్యవర్తి ఇమామ్ హుస్సేన్‌ను సంప్రదించాలని సదరు అధికారి సూచించాడు. రైతు మధ్యవర్తిని కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు మూడు వేల రూపాయలు లంచం ఇచ్చాడు. ఈ తతంగాన్ని మొత్తం రహస్యంగా వీడియో తీయించాడు. ఈ అధికారిపై గతంలో ఎన్నో ఆరోపణలు వచ్చినా అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పుడైనా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి మరి. ఈ విషయంపై ఆర్ఐ దినేజ్ కుమార్‌ను వివరణ కోరగా తనపై దుష్ప్రచారం చేసేందుకు ఆ వీడియో వైరల్ చేస్తున్నారని, ఆ సంఘటన ఆరు నెలల క్రితం జరిగినదిగా తెలిపారు.

## నిందితుల అరెస్టు

ఎమ్మిగనూరు, జనవరి 13: ఓ వ్యక్తి మృతి కేసులో పోలీసులు శనివారం నిందితులను అరెస్టు చేశారు. పట్టణానికి చెందిన మహబూబ్ బాషాపై కొత్త ఏడాది వేడుకల సందర్భంగా కొంత మంది యువకులు దాడి చేశారు. మహబూబ్ బాషా గాయపడడంతో కర్నూలులో చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందాడు. ఈ కేసులో నిందితులుగా ఉన్న బోయ రాజు, బోయ వెంకటేష్, అలియాస్ వెంకి, బోయ చరణ్ రాజు, సూగూరు హోమ్ దీప్, ఈడిగ గోపాల్ గౌడ్, కొమ్ము రాజశేఖర్, గొల్ల బాలాజీ, వడ్డె పవన్ కల్యాణ్, కారుమంచి ఉరుకుంద, ఉప్పర యశ్వంత్ కుమార్, ఉప్పర ముగతి భీమాలతోపాటు మరో ఇద్దరు మైనర్లను పట్టణంలోని ఉప్పర వీధిలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## పడిపోయిన మొక్కజొన్న ధర

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 13: కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రయోజనాన్ని చేకూర్చేందుకు ప్రతి పంట ఉత్పత్తికి మద్దతు ధరను ప్రకటిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ఈ ధర లభించనప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని సంస్థలను రంగంలోకి దించి మద్దతు ధరకు రైతుల నుంచి పంట ఉత్పత్తులను సేకరించాలి. అయితే.. ఈ మద్దతు ధర ప్రకటించడం వరకే తమ పని అంటూ రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.1,758లు మాత్రమే దక్కింది. ప్రభుత్వం క్వింటం మొక్కజొన్నలకు రూ.2,090గా నిర్ణయించింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే దాదాపు రూ.300 తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మద్దతు ధర దక్కనప్పుడు మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు వెంటనే రంగంలోకి దిగి కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు నష్టపోకుండా మొక్కజొన్నలను మద్దతు ధరకు కొనాలి. నెల రోజులుగా మొక్కజొన్న రైతులు నష్టాలకు గురవుతున్నా కర్నూలు, నంద్యాల జిల్లాల మార్క్‌ఫెడ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. మరింతగా ఈ ధర తగ్గకముందే వెంటనే మద్దతు ధరకు తమ వద్ద ఉన్న మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని మొర పెట్టుకుంటున్నారు.

## కేంద్ర మంత్రికి పీఠాధిపతి ఆశీస్సులు



కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషికి ఆశీస్సులు ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 13: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద జోషికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులు అందజేశారు. శుక్రవారం రాత్రి మంత్రాలయంలో బస చేసి శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేసే సంస్థాన పూజల్లో పాల్గొన్నారు. కేంద్ర మంత్రికి పీఠాధిపతి మెమెంటో, శేషవస్త్రం, పలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు ఉన్నారు.

## నకిలీ మోటార్ ఇన్‌స్పెక్టర్ల అరెస్టు

**కారు, రూ.2,200 నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం**

ఆళ్లగడ్డ, జనవరి 13: ఆళ్లగడ్డ పట్టణంలో మోటార్ సైకిల్ ఇన్‌స్పెక్టర్లమని చెప్పుకొని వాహనం తనిఖీ చేస్తుండగా పట్టణ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటరెడ్డి తమ సిబ్బందితో కలిసి ముగ్గురిని శనివారం అరెస్టు చేశారు. కోవెలకుంట్ల రోడ్డులోని కాశీనాయన ఆశ్రమం వద్ద ఆళ్లగడ్డకు చెందిన విల్సన్‌కుమార్, దూదేకుల హుసేనయ్య, సగబాలి చిన్నవెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటరామయ్య విలేఖరుల సమావేశంలో చెప్పారు. నిందితుల వద్ద నుంచి టాటా జెస్ట్ కారు, రూ.2,200 నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. వ్యసనాలకు అలవాటుపడి, డబ్బు సంపాదించడానికి ప్రజలను మోసం చేస్తున్న వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

## మల్లన్న సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు

శ్రీశైలం, జనవరి 13: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్‌రావుకు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మల్లికార్జునస్వామి, అమ్మవార్ల భృంగివాహనసేవలో పాల్గొన్నారు.

### మల్లన్న సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం రాత్రి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మినారాయణ్ అలిశెట్టి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న నాయమూర్తికి అధికారులు, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు జడ్జి స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని, భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు.

## అయోధ్య రామమందిరం ప్రారంభ వేడుకకు ఆహ్వానం



శివస్వామికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జనవరి 13: అయోధ్య రామ మందిరం ప్రారంభ వేడుకకు శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామిజి, శ్రీశైలం శ్రీదత్తసాయి మౌనస్వామి ఆశ్రమం ఆధ్యాత్మిక ఆశ్రమం గురువు శివస్వామికి ఆహ్వానం అందింది. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు నిర్వాహకులు పంపిన ఆహ్వానపత్రం, అయోధ్య చిత్రపటం, అక్షింతలు శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు చేతుల మీదుగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివ స్వామికి అందజేశారు. స్థానిక రామసేవకులు గిరిధర్, చెన్న కేశవ, చదువుల శ్రీను, హనుమాన్ నాయక్, రామకృష్ణ పాల్గొన్నారు.

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## టీడీపీలో చేరిక



వైసీపీ నుంచి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

**అవుకు, జనవరి 13:** రామాపురం గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి జోరుగా వలసలు కొనసాగుతున్నాయి. శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరారెడ్డి, ఎస్. రామకృష్ణారెడ్డి, మారంపల్లారెడ్డి, రేగటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో రామాపురం గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి జనార్దన్‌రెడ్డి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

## బుగ్గనను ఇంటికి పంపడం ఖాయం

- టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి




మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

**డోన్, జనవరి 13:** అరాచక పాలన సాగిస్తున్న మంత్రి బుగ్గనను రాబోయే ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో టీడీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముస్లీం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ముస్లిం మైనార్టీల సంక్షేమ పథకాలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీల కోసం దుల్హన్ పథకం అమలు చేసి చేయూతనిచ్చిందన్నారు. టీడీపీ హయాంలో రంజాన్ తోఫాను ఇస్తే.. వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం చాలా అన్యాయమన్నారు. చంద్రబాబు హయాంలో షాదీఖానాలను విరివిగా ఏర్పాటు చేస్తే.. వైసీపీ పాలనలో అసలు పట్టించుకోలేదని అన్నారు. వైసీపీ పాలనలో మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. టీడీపీ నాయకులు ఆలంకొండ నబీసాహేబ్, అల్లాబకాష్, ఎస్ఎండీ రఫీ, సలాం, ఫయాజ్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు మస్తాన్, ఆలిబాబా, రెహమాన్, సర్దార్ ఫాషా, హుసేన్‌పీరా, డిష్ వలి, చాంద్‌బాషా, జనసేన నాయకులు బ్రహ్మం, లాల్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

**ప్యాపిలి, జనవరి 13:** మండలంలోని హుసేనాపురం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 2011-12 పది బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. బెంగళూరు, హైదారాబాద్ వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 50 మంది పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం చదువు చెప్పిన గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రం ప్రారంభం



అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

**బేతంచెర్ల, జనవరి 13:** బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శనివారం ప్రారంభించారు. 117 మందికి ఇంటి స్థలాల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. అలాగే 110 మంది రైతులకు 120 ఎకరాల శాశ్వత భూమి హక్కు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డోన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**'సమస్యలు పరిష్కరించాలి'**

బేతంచెర్ల పట్టణంలో విధులు నిర్వహిస్తున్న 104, 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. సురేష్ కుమార్, ప్రసాద్, నాగార్జున, రవి, మదనమోహన్ రెడ్డి, శేఖర్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించి ఆబ్కాస్‌లో తమను కలపాలని విన్నవించారు.

## నేలవాలిన జొన్న పంట



పేరాయిపల్లెలో నేలవాలిన జొన్న పంట

**ఆళ్లగడ్డ, జనవరి 13:** ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్‌లో రైతులు సాగు చేసిన జొన్న పంట వీచిన ఈదురు గాలులకు నేలవాలింది. జొన్నపంట కోత దశకు రావడంతో వీచిన కొద్దిపాటి గాలులకే నేలవాలడం వల్ల జొన్న కంకులు బరువు తగ్గడంతో పాటు, వాటిని సరి చేసుకోవడానికి కూలీల ఖర్చు అవుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. వ్యవసాయ సబ్ డివిజన్‌లో 1000 ఎకరాల్లో జొన్న పంట దెబ్బతింది.

## కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే పూర్తి

**చాగలమర్రి, జనవరి 13:** చాగలమర్రి మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే పూర్తయినట్లు వైద్యుడు ఇమ్రాన్, అంజలి తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారికి ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ నెల రోజుల నుంచి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు కుష్ఠువ్యాధి గ్రస్థుల గుర్తింపు సర్వే చేసి 149 అనుమానిత కేసులు గుర్తించారని చెప్పారు. వారిలో ఒక కేసు వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. ప్రభుత్వం ద్వార వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌పీహెచ్‌వో, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# డిమాండ్లు నెరవేర్చాలి

- సమ్మె కొనసాగించిన అంగన్‌వాడీలు
- వినూత్నంగా నిరసన
- కార్మిక, రైతు సంఘాల మద్దతు



డోన్‌లో చెవిలో పూలు పెట్టుకుని నిరసన



చాగలమర్రిలో నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



బేతంచెర్లలో మద్దతు తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

**డోన్(రూరల్), జనవరి 13:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు శనివారం చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన రిలే దీక్షలు 33వ రోజుకు చేరుకున్నాయి. సీపీఐ, ఏఐటీయుసీ నాయకులు పాల్గొన్నారు.

**బేతంచెర్ల:** అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టం ఉపయోగించడం దుర్మార్గమైన చర్య అని జనసేన పార్టీ మండల కన్వీనర్ చల్లా మద్దిలేటి అన్నారు. శనివారం పట్టణంలోని బస్టాండులో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శిబిరాన్ని జనసేన పార్టీ మండల నాయకులు సందర్శించి సమ్మెకు తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. జనసేన నాయకులు నాగరాజు, మద్దయ్య నాయుడు, నవీన్‌రాజు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**బనగానపల్లె:** ఎస్మా చట్టం ప్రయోగించడం, నోటీసులు ఇచ్చి ప్రభుత్వం అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని సీఐటీయూ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె 33వ రోజుకు చేరింది. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**సంజామల:** సంజామలలోని సహకార బ్యాంక్ ఆవరణలో అంగన్‌వాడీలు 33వ రోజు సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**రుద్రవరం:** తహసీల్దారు కార్యాలయం ఎదుట 33వ రోజు నిరవధిక సమ్మె కొనసాగించారు. సమ్మెకు సీఐటీయూ, రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలన్నారు. గతంలో హామీ ఇచ్చి ఇప్పుడ భయపెట్టం సరికాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

**చాగలమర్రి:** అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం 33వ రోజు కొనసాగింది. అంగన్‌వాడీలు, హెల్పర్లకు అండగా ఉంటామని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకుడు ఇండ్ల రమణారెడ్డి అన్నారు. చాగలమర్రి అంబేడ్కర్ విగ్రహం ఎదుట రహదారిపై షోకాజ్ నోటీసులను దహనం చేస్తూ నిరసన ప్రకటించారు. ప్రభుత్వం దిగివచ్చి డిమాండ్‌లను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని అంగన్‌వాడీలు హెచ్చరించారు.

**శిరివెళ్ల:** శిరివెళ్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీ కార్మికులు 33 రోజులుగా సడలని దీక్షతో నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ శనివారం నినాదాలు చేశారు.



బనగానపల్లెలో..




రుద్రవరంలో..



శిరివెళ్లలో..



సంజామలలో..

# పేదలను దగా చేసిన సీఎం : టీడీపీ

**కొలిమిగుండ్ల జనవరి 13:** సంక్రాంతి కానుక ఇవ్వకుండా సీఎం జగన్ పేదలను దగా చేశారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని పెట్నికోట, మీర్జాపురం, ఇటిక్యాల గ్రామాల్లో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలను ఉదయం నుంచి రాత్రి వరకు బీసీ విస్తృతంగా పర్యటించారు. జనార్దన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్ తీరును, పెత్తందారి పోకడలను వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలే బహిరంగంగా ఎండగడుతూ జగన్‌ను విమర్శిస్తున్నారన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు సీఐడీ అధికారులను వాడుకుంటూ వారిని అడ్డు పెట్టుకొని చంద్రబాబుపై, టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జిలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమ ర్శించారు. పెట్నికోట గ్రామంలో 2014 నుంచి 1019 వరకు రూ.471 లక్షలతో అభివృద్ధి చేశానని, రూ.134 లక్షలు రుణమాఫీ చేశామని తెలిపారు. మీర్జాపురంలో రూ.200 లక్షలతో బీటీ రోడ్డు, రూ.78 లక్షలతో అభివృద్ధి పనులు, రూ.30 లక్షలు రైతు రుణమాఫీ చేశామని చెప్పారు. ఇటిక్యాల గ్రామంలో రూ.77 లక్షలతో అభివృద్ధి, రూ.30 లక్షలు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. పెట్నికోట నాగిరెడ్డి, గొంగటి హుస్సేన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మీర్జాపురం చిన్నపురెడ్డి, రామకృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, ఇటిక్యాల తోట శివారెడ్డి, ఐవీ పక్కీరారెడ్డి, మూలే రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, కోటపాడు శివరామిరెడ్డి, కో కన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి, టీడీపీ, ఎమ్మార్పీఎస్, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బనగానపల్లె:** అవినీతి వైసీపీ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలు అని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. పట్టణంలోని కొండపేటలోని కరణం మొహిద్దీన్ కాలనీలో శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ మాట్లాడుతూ పేదలకు టీడీపీ ప్రభుత్వం సంక్రాంతి కానుక అందించేదన్నారు. సీఎం జగన్ వాటిని రద్దు చేసి పేదల కడుపుకొట్టారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొలిమిగుండ్ల: పెట్నికోటలో ప్రచారం చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లెలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

**చాగలమర్రి:** టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు ఇండ్ల రమణారెడ్డి, సుబ్రమణ్యం అన్నారు. శనివారం ముత్యాలపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ టీడీపీ మ్యానిఫెస్టో పథకాలు ప్రజలకు భరోసా నింపుతాయన్నారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. వైసీపీ పాలనపై ప్రజలు విసుగుచెంది రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆళ్లగడ్డలో జరిగిన రా..కదలిరా సభతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ నింపిందని అన్నారు. టీడీపీ నాయకులు గోపాల్, ప్రతాప్‌రెడ్డి, హరిసాయినాథ్‌రెడ్డి, చిన్నగోపాల్, శేఖర్, పకీర్‌బాషా, ప్రతాప్ పాల్గొన్నారు.

**శిరివెళ్ల:** మాజీ సీఎం, విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మండలంలోని కామినేనిపల్లె గ్రామంలో ఆమె శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అందించబోయే పలు సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామానికి చెందిన శిరిగిరి పావన వెంకటరెడ్డి, శిరిగిరి నరసింహారెడ్డి, శిరిగిరి మహేశ్వరరెడ్డి, మద్దిలేటి తదితరులు తమ అనుచరులతో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, మాజీ సర్పంచ్ శిరిగిరి రాంభూపాల్‌రెడ్డి, సూరా రామ, శేష ఓబుళరెడ్డి, గంగదాసరి శ్రీనివాసరెడ్డి, లక్ష్మిరెడ్డి, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

- రాష్ట్రంలోని ప్రజల చూపు టీడీపీ వైపు ఉందని యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా శిరివెళ్లలోని ముల్లాపేట, ఖర్జూరపేట, పసులపేటలో శనివారం పర్యటించి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు సీఎం కావాలన్నారు. కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మురళి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, మౌళిబాషా, నాలి వలి, పీపీ లింగమయ్య, అబూబకర్ సిద్ధిఖ్, బీఎండీ రఫి, బీసీ ఫిదా హుసేన్, ఉల్లి వెంకట సుబ్బయ్య, షఫీవుల్లా, మహమ్మద్ హుసేన్, యూనుస్, ఇర్ఫాన్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జి దంపతులకు సన్మానం



ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్ రెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

**డోన్, జనవరి 13:** ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్‌రెడ్డి, అనిత దంపతులను శనివారం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కొచ్చెర్వు విక్రమసేనా రెడ్డి సన్మానించారు. కర్నూలుకు వచ్చిన హైకోర్టు జడ్జి జస్టిస్ హరినాథ్‌రెడ్డిని వారు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. హైకోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన మొదటిసారి జిల్లాకు విచ్చేసిన వారిని సన్మానించారు.

## డోన్‌కు తరలిన ముస్లిం నాయకులు



ప్యాపిలి నుంచి డోన్‌కు వెళ్తున్న ముస్లిం నాయకులు

**ప్యాపిలి, జనవరి 13:** నియోజకవర్గ స్థాయిలో డోన్‌లో నిర్వహించిన టీడీపీ ముస్లీంల సమావేశానికి శనివారం ప్యాపిలి పట్టణానికి చెందిన పలువురు మస్లీం నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ ముస్లీం నాయకులు ఖాజాపీర్, ఎస్‌కే వలి, బాషా తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

## వెదురు సేకరణ ప్రారంభం

**రుద్రవరం, జనవరి 13:** రుద్రవరం కలప డిపో పరిధిలో వెదురు సేకరణ ప్రారంభించినట్లు శనివారం రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. కలప డిపో పరిధిలో కూపులలో వెదుర్లను సేకరిస్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో వెదురు సేకరణ కొనసాగుతుందని రేంజర్ తెలిపారు.

## స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలు

**డోన్(రూరల్), జనవరి 13:** పట్టణంలో స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వినియోగదారుల రక్షణ సంఘం ఆధ్వర్యంలో గీతా యోగాసన సంఘం గురూజీ, రాంపుల్లయ్య సంఘం సభ్యులు రాజయ్యగౌడును సన్మానించి స్వామి వివేకానంద చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ సంఘం తాలుకా అధ్యక్షుడు ఏతఈ నాగరాజు, గీతా యోగసన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**రుద్రవరం, జనవరి 13:** మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి, లక్ష్మీగోదాదేవి, మానస లింగేశ్వరస్వామి, అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపీశర్మ, శివశర్మ స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

## నరసింహ స్వామికి..

**రుద్రవరం, జనవరి 13:** మండలంలోని నరసాపురం, రుద్రవరం నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

## వెండి హారతి పళ్లెం బహూకరణ



వెండి హారతి పళ్లెం అందిస్తున్న భక్తులు

**రుద్రవరం, జనవరి 13:** మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి దేవాలయానికి శనివారం గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఇందూరి సునీల్‌కుమార్‌రెడ్డి - సునీత దంపతులు 850 గ్రాముల వెండి హారతి పళ్లెందను బహూకరించారు. ఆలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి నరసింహులుకు అందించారు.

## నేడు గోదాదేవి కల్యాణం

**ఆళ్లగడ్డ, జనవరి 13:** అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం ప్రహ్లాద వరదస్వామి, గోదాదేవి అమ్మవారికి కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు శనివారం చెప్పారు. అమ్మవారి కళ్యాణాన్ని పురస్కరించుకొని ప్రహ్లాద వరదస్వామి, గోదాదేవి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం గోదాదేవి అమ్మవారి కల్యాణాన్ని నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత గ్రామోత్సవం నిర్వహించి, ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తామన్నారు. కార్యక్రమాలను పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు.

## ఆలయానికి రూ.2.60 లక్షల ఆదాయం

**బేతంచెర్ల, జనవరి 13:** మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్ర ఆదాయం రూ2.60 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రరావు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.2,60,290 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. అలాగే దేవస్థానం అభివృద్ధి కోసం నంద్యాల జిల్లా పాణ్యం మండలం తమ్మరాజుపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయస్వామి రైస్‌మిల్ యజమాని వై.రంగయ్య రూ.50 వేలు విరాళంగా ఆలయ ఈవో పాండురంగారెడ్డికి అందజేశారు.

## ఇంటింటికి అయోధ్య రాముడి అక్షింతలు



కొత్తపల్లెలో అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు

**చాగలమర్రి, జనవరి 13:** మండలంలోని డి.కొత్తపల్లె గ్రామంలో అయోధ్యరాముడి అక్షింతలను ఎస్ఎస్ఎఫ్ సభ్యులు శనివారం రాత్రి ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. పూజలు చేసిన అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికి అందజేసినట్లు ఎస్ఎస్ఎఫ్ సభ్యులు సురేష్ కుమార్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి తెలిపారు. 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ అక్షింతలను ప్రతి ఇంటిలో పూజలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్నరెడ్డి, రామిరెడ్డి, ఓబన్న, బాలిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా ధనుర్మాస పూజలు

**చాగలమర్రి, జనవరి 13:** మండలంలోని మద్దూరు, చాగలమర్రిలో వెలసిన చెన్నకేశవ, ప్రసన్న వెంకటేశ్వరస్వామి, కోదండ రామాలయాల్లో శనివారం వేద పండితుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. కోదండ రామాలయంలో సీతారాము లకు జల, క్షీర, రుద్రాభిషేకాలు చేశారు. మహిళలు సామూహి కంగా రామనామ పారాయణం చేశారు. కోలాట నృత్యంతో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

## తైక్వాండో పోటీల్లో ప్రతిభ

**ఆళ్లగడ్డ, జనవరి 13:** ఆళ్లగడ్డకు చెందిన ఎల్‌టీ భువనేశ్వరి ఆల్ ఇండియా యూనివర్సిటీలకు జరిగిన మహిళా చాంపియన్ షిప్ తైక్వాండో పోటీలలో మూడో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ పోటీలు ఈనెల 8వ తేదిన రాజస్థాన్ జరిగిన ఈ పోటిలలో ఆమె పాల్గొని పతాకాన్ని సాధించడంతో క్రీడాభిమానులు ఆమెను అభినందించారు.

## 'టీడీపీతోనే పేదల సంక్షేమం'

**చాగలమర్రి, జనవరి 13:** రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పెద్దవంగలి గ్రామంలో టీడీపీ కార్యకర్త ఆదిశేషయ్యను పరామర్శించారు. టీడీపీ నాయకులు పాల షరీఫ్, నాగేంద్ర, నర్సయ్య, సుబ్రమణ్యం, డిఎం బాషా, నారాయణ ఉన్నారు.